ఎంపీ దామోదర్‌రావుకు కేసీఆర్ పరామర్శ

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రాజ్యసభ సభ్యుడు, నమస్తే తెలంగాణ దినపత్రిక సీఎండీ దీవకొండ దామోదర్‌రావును బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పరామర్శించారు. ఈ నెల 2న ఎంపీ దామోదర్‌రావు తల్లి ఆండాళమ్మ కాలం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం బంజారాహిల్స్‌లోని దామోదర్‌రావు ఇంటికి వెళ్లిన కేసీఆర్ ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. దామోదర్‌రావును, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేసీఆర్ వెంట ఎంపీ సంతోష్‌కుమార్, బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ తదితరులున్నారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కూడా దామోదర్‌రావును పరామర్శించారు.

47 మంది డీఎస్పీల బదిలీ

ఉత్తర్వులు జారీచేసిన డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో 47 మంది డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ప్రభుత్వం పలు దఫాలుగా డీఎస్పీలను బదిలీ చేసిన విషయం తెలిసిందే.

డీఎస్పీ ప్రణీత్‌రావు సస్పెన్షన్

రాష్ట్ర పోలీస్‌శాఖ సంచలన నిర్ణయం తీసుకున్నది. గతంలో ఎస్ఐబీలో కీలకంగా వ్యవహరించి, ప్రస్తుతం డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావును సస్పెండ్ చేసింది. ఎస్ఐబీ పేరుతో అధికారాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలు రావడంతో ఆయనపై ఈ చర్య తీసుకున్నట్టు పోలీస్‌శాఖ ప్రకటించింది. ఎస్ఐబీలో పనిచేసిన సమయంలో ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్టు ప్రణీత్‌రావు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

రెండో విడత దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని దళితబంధు ఐక్య వేదిక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నముండ్ల సంపత్ మహరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో దళితబంధు లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకుడు రామిళ్ల కిరణ్, టీఎస్ ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, ప్రధాన కార్యదర్శి రేణుకుంట్ల మహేశ్‌తో పాటు 100 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

-కృష్ణకాలనీ

లోకం పోకడ



ఫ్రీ బస్సుల్లో రద్దీ గురించి మంచి అవగాహన వచ్చిందట మన మంత్రిగారికి!

భట్టి బైపాస్!

మొదటిపేజీ తరువాయి...

కల్పించామంటూ చేసిన ప్రకటనలన్నీ ఉత్తమాటలేనా? ఇకపై మంత్రులకు రోజూ అవమానాలేనా..? ప్రస్తుత పరిణామాలు ఈ వాదనలకు ఊతమిస్తున్నాయి. ఎల్బీస్టేడియంలో సోమవారం 5,192 మంది లెక్చరర్లు, టీచర్లు, కానిస్టేబుల్, మెడికల్ సిబ్బందికి నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల విభాగం నుంచి కొన్ని పత్రికలకు మొదటి పేజీ ప్రకటనలు ఇచ్చారు. అవికూడా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాకుండా.. మిగతా జిల్లాలకు వెళ్లేలా ప్రకటనలు ఇచ్చారు. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో మాత్రమే ముద్రించారు. ఇందిరాగాంధీ తప్ప మరో వ్యక్తి ఫొటో కనిపించలేదు. గతంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సంబంధిత మంత్రుల ఫొటోలు ఆ ప్రకటనల్లో ఉండేవి. ఈసారి భట్టితోపాటు సంబంధిత మంత్రులను పక్కన పెట్టేశారు. సోమవారం ఇచ్చిన నియామకపత్రాల్లో పోలీస్, విద్య, బీసీ సంక్షేమ, వైద్యారోగ్య శాఖలకు చెందిన పోస్టులు ఉన్నాయి. వీటిలో పోలీస్, విద్యా శాఖలు సీఎం వద్దే ఉన్నాయి. మిగతా.. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఫొటోలైనా వాడటం మర్యాద అని విశ్లేషకులు చెప్తున్నారు. తాజా పరిణామాలను బట్టి భట్టితోపాటు ఇతర మంత్రులందరినీ పక్కన పెట్టేసినట్టేనని.. రేవంత్ మాత్రమే కనబడాలన్న భావన స్పష్టంగా కనిపిస్తున్నదని అంటున్నారు. ఇది కచ్చితంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహను అవమానించడమేనని భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యం నుంచి వ్యక్తిస్వామ్యంవైపు మళ్లిందనడానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ అంటున్నారు. ఇప్పటికైనా డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులు వాస్తవాలు గ్రహించాలని సూచిస్తున్నారు.

రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ

ప్రభుత్వ ప్రకటనల నుంచి భట్టి విక్రమార్కను తొలిగించడంపై అటు రాజకీయ వర్గాల్లో, ఇటు సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతున్నది. ఇది ముందుగా ఊహించిన పరిణామమే అని విశ్లేషకులు చెప్తున్నారు. రేవంత్‌రెడ్డి స్వభావం తమకు ముందు నుంచీ తెలుసని, భట్టి, ఇతర మంత్రులకు ఇస్తున్న ప్రాధాన్యం మూడు నాళ్ల ముచ్చటేనని అప్పుడే అనుకున్నామని అంటున్నారు. ప్రజాప్రతినిధులకు అవమానాలు కాంగ్రెస్ పార్టీలో కొత్తేం కాదని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ ఇన్నాళ్లూ తొడుక్కున్న 'అందరం ఒక్కటే' అనే ముసుగు తొలిగిపోయి 'అంతా ఒక్కడే' అనే అసలు రంగు బయటపడిందని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. భట్టి ఫొటో తీసేయడం ద్వారా రేవంత్‌ఆయనకు బైబై చెప్పేశాడని సోషల్ మీడియాలో కామెంట్లు వస్తున్నాయి. రాను రాను ఇలాంటివి ఇంకెన్నో చూడాల్సి వస్తుందని, కాంగ్రెస్ నేతలు సిద్ధంగా ఉండాలంటూ సలహాలు ఇస్తున్నారు.

హైకమాండ్ అవకాశమిస్తే పోటీ చేస్తా!

ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీపై గవర్నర్ తమిళిసై ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేవుడు కరుణించి, బీజేపీ హైకమాండ్ అవకాశమిస్తే చూద్దామంటూ ఆమె వ్యాఖ్యానించారు. దీంతో గవర్నర్‌కి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి ఉన్నట్టు వెల్లడైంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా గవర్నర్ తమిళి సై తమిళనాడు రాష్ట్ర రాజకీయాల్లోకి వెళ్తారని ప్రచారం జరిగింది. ఈ మేరకు ఆమె బీజేపీ పెద్దలను కలిసి తన ఆసక్తిని వ్యక్తం చేసినట్టు అప్పట్లో పెద్దఎత్తున చర్చ జరిగింది. తాజాగా పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమిళనాడులోని కన్యాకుమారి నుంచి ఆమెను ఎంపీగా బరిలో నిలిపేందుకు బీజేపీ అధిష్ఠానం యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్ర గవర్నర్‌గా రాక ముందు తమిళిసై సౌందర్‌రాజన్ తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేశారు.

సోమవారం తెలంగాణభవన్‌లో నిర్వహించిన ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు తదితరులు

వసూల్ కాంగ్రెస్

కాంగ్రెస్ చరిత్ర మొత్తం అరాచకాలు, దోపిడీలే. ఇప్పటికే ఆ పార్టీలో ముఠాలు తయారయ్యాయి. విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారు. రియల్‌ఎస్టేట్, మైన్లు.. ఇలా అనేక రంగాలవారిని వేధింపులకు గురిచేస్తున్నారు. మా వద్ద సమస్త సమాచారం ఉన్నది.

-బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్

మొదటిపేజీ తరువాయి...

హెచ్చరించారు. అతిత్వరలోనే కాంగ్రెస్ నిజస్వరూపం రాష్ట్ర ప్రజలందరికీ తెలుస్తుందని చెప్పారు. తెలంగాణభవన్‌లో సోమవారం ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అనేక విషయాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

నిరంతరం ప్రజలతోనే ఉండండి

ప్రజా జీవితంలో ఉండటం అంటే అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాదని, నిరంతరం ప్రజలతో మమేకం కావాలని, గెలుపోటములతో సంబంధం లేకుండా పనిచేయాలని కేసీఆర్ ఉద్బోధించారు. రాజకీయాల్లో గెలుపు-ఓటమి రెండూ ఉంటాయని, ఏ పాత్రలోనైనా ఇమిడిపోవాలని సూచించారు. 'గెలిస్తే ఉంటాం.. లేకపోతే ప్రజలతో ఉండబోం' అనడం అవివేకమని చెప్పారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ మరణించినప్పుడు అయ్యో దేశం ఏమవుతుందని భయపడ్డారని, ఆ తర్వాత ఇందిరాగాంధీ ఒకవెలుగు వెలిగారని, ఆమె మరణించినప్పుడు కూడా అదేభావన కొంతమందిలో ఉండేదని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్ వంటి నేత లేడని అనిపించేదని, ఆయన గతించిన తర్వాత కూడా రాజకీయాలున్నాయని, ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని వివరించారు. వ్యక్తుల కోసం రాజకీయం ఉండదని, పార్టీలు ఉంటాయని, వ్యక్తులు వస్తారు, వెళ్తారని పేర్కొన్నారు. పార్టీయే నాయకులను సృష్టిస్తుందని, నాయకులు పార్టీని సృష్టించలేరని స్పష్టంచేశారు. పార్టీ వ్యవస్థీకృతమై ఉన్నంత కాలం ఎవ్వరూ ఏమీ చేయలేరని అన్నారు.

ధీరోదాత్తులం.. ఓటమికి భయపడం

ఎన్నికల్లో గెలుపు, ఓటమి సహజమని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, భయపడకుండా మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించినపుడే ధీరోదాత్తులం అవుతామని కేసీఆర్ ఉద్బోధించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ధీరోదాత్తులుగా ఉండాలని ఆకాంక్షించారు. ఓటమి ఎదురైనంత మాత్రాన కుంగిపోవడం సరికాదని, మరింత, రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. 'గాడిదలకు, గుర్రాలకు మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. మనం చేసిన మంచి పనులను ప్రజలు ఇప్పుడు తల్చుకుంటున్నారని, మన శ్రమ వృథాపోదని స్పష్టంచేశారు. మళ్లీ అద్భుతమైన మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న ధీమా వ్యక్తంచేశారు. ఓర్పు, సహనంతో పనిచేద్దామని సూచించారు. కుదుపులు వచ్చినప్పుడు కిందపడకుండా, తట్టుకొని నిలబడి ముందుకు సాగాలని కర్తవ్యబోధ చేశారు. పదవులొక్కటే ముఖ్యం కాదని, ప్రజల మమకారం చూరగొనాలని సూచించారు. ఓటమి కూడా మనకు ఒక మంచి అవకాశమని, మనల్ని మనం మరింత రాటుదేలేలా తీర్చిదిద్దుకోవడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఓటమిని కూడా అవకాశంగా మలచుకుందామని, ఒకరకంగా ఓడిపోవడం దిష్టితీసివేసినట్టు అయ్యిందని పేర్కొన్నారు.

రైతాంగాన్ని ఆదుకునేందుకు పనిచేశాం

రాష్ట్రంలో రైతులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక విసూత్న కార్యక్రమాలను చేపట్టిం

> తెలంగాణ ప్రజలకు సాగు, తాగునీళ్లు ఇవ్వడమే లక్ష్యంగా బీఆర్ఎస్ సర్కారు పనిచేసింది. కాస్ట్ రేషియో కన్నా మానవీయ కోణమే ముఖ్యమని నిర్ణయించుకున్నాం. అందుకే పాతాళంలో ఉన్న గంగమ్మను పైకెత్తి తీసుకొచ్చి ప్రజల దాహార్తిని, రైతుల కన్నీటిని తుడిచే ప్రయత్నం చేశాం. కాస్ట్ రేషియోను పరిగణనలోకి తీసుకుంటే తెలంగాణలో ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా కట్టలేం.
>
> -బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్

నేడు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ నేతలతో భేటీ

మంగళవారం నాడు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు లోక్‌సభ స్థానాల పరిధిలోని పార్టీ ముఖ్యనేతలతో పార్టీ కార్యాలయం తెలంగాణభవన్‌లో భేటీ అవుతారు. పార్టీ నేతలతో చర్చించిన అనంతరం అభ్యర్థులను నిర్ణయించి ప్రకటిస్తారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం, వ్యూహంపై నేతలకు మార్గనిర్దేశనం చేస్తారు.

కరెంటు పోతే జై కాంగ్రెస్ అంటున్నరు

మిషన్ భగీరథ ద్వారా తాగునీళ్లు ఇచ్చేందుకు బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేశామని, ఇప్పుడేమో నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో కూడా నీళ్లు ఇవ్వడంలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రజలను ఇబ్బందిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కరెంటు సరఫరాకు బీఆర్ఎస్ సర్కారు సకల ఏర్పాట్లు పూర్తిచేసి పెట్టిందని, కానీ, వాటిని నీరుగారుస్తున్నదని, అవగాహనారాహిత్యంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. రైతుల పొలాలకు నీళ్లు కూడా రావడంలేదని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనంతోనే ఇలా అవుతున్నదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న సభలు, సమావేశాల్లో కరెంటు పోతే 'జై కాంగ్రెస్' అని ప్రజలు అంటున్నారని, సోషల్ మీడియాలో తాను ఈ విషయాన్ని చూశానని పేర్కొన్నారు.

> గాడిదలకు, గుర్రాలకు మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారు. మనం చేసిన మంచి పనులను ప్రజలు ఇప్పుడు తల్చుకుంటున్నారు. మన శ్రమ వృథా పోదు. మళ్లీ అద్భుతమైన మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాం. ఓర్పు, సహనంతో పనిచేద్దాం.
>
> -బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్

కనబడుతున్నదని కేసీఆర్ చెప్పారు. 1989లో టీడీపీ ఓడిపోయినప్పుడు ఎన్టీఆర్‌తో తాను ఉన్నానని, ఒక ఐదేండ్లు ఓపికపడితే కాంగ్రెస్‌వాళ్లే మనకు అధికారం అప్పగించి వెళ్తారని చెప్పానని, తాను అన్నట్టుగానే 1994లో అధికారాన్ని టీడీపీకి అప్పగించారని గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ చరిత్ర మొత్తం అరాచకాలు, దోపిడీనే అని, బీఆర్ఎస్ కార్యకర్తలు రెండు, మూడు నెలలు ఓపికపడితే కాంగ్రెస్ పార్టీనే ఎజెండాను మనకు అప్పగిస్తుందని విశ్లేషించారు. ఇప్పటికే ఆ పార్టీలో ముఠాలు తయారయ్యాయని, విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని, రియల్‌ఎస్టేట్, మైన్లు.. ఇలా అనేక రంగాలవారిని వేధింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. తమ వద్ద సమస్త సమాచారం ఉన్నదని తెలిపారు. కర్ణాటకలో మాదిరిగానే ఇక్కడ కూడా వసూళ్లకు ప్రణాళికలు వేసుకున్నారని ఆరోపించారు. మరో రెండు-మూడు నెలల్లో అంతా ప్రజల అనుభవంలోకి వస్తుందని చెప్పారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ముగ్గురు నేతల మధ్య ఆధిపత్యపోరులా మారిందని విమర్శించారు. కాంగ్రెస్‌లో అనేక పంచాయితీలు ఉంటాయని, ఈ ఐదేండ్లు మనం చూసుకుంటూ ఉంటే చాలని పేర్కొన్నారు.

ఖమ్మంలో గెలుస్తాం

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ నామా నాగేశ్వరరావు మరోసారి పోటీచేస్తారని కేసీఆర్ ప్రకటించారు. గత ఎన్నికల్లో లక్షా 70 వేల ఓట్ల మెజార్టీతో ఖమ్మం సీటును గెల్చుకున్నామని, ఈ సారి కూడా గెల్చుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. ఖమ్మం చైతన్యవంతమైన జిల్లా అని, విజయం సాధించే దిశగా పయనిద్దామని పిలుపునిచ్చారు. మహబూబాబాద్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవితకు తిరిగి టికెట్ ఇస్తున్నామని, ఆమె కూడా మంచి మెజార్టీతో గెలుస్తారని చెప్పారు. మహబూబాబాద్ స్థానంలో పార్టీకి మంచి నాయకత్వం ఉన్నదని మెచ్చుకున్నారు. ఇద్దరు సిట్టింగ్ ఎంపీలపై ఎలాంటి ఆరోపణలు లేవని, స్వచ్ఛమైన నాయకులని కితాబిచ్చారు.

మానవీయ కోణమే ముఖ్యం

ఎకనామిస్ట్‌లు, ఆడిటర్లు.. నీళ్ల ప్రాజెక్టుల కాస్ట్ రేషియో గురించి మాట్లాడుతుంటారని, కాళేశ్వరం విషయంలో ఇలాంటి కథలే చెప్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం వ్యాపార సంస్థ కాదని, లాభాపేక్షతో పనిచేయదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలకు సాగు, తాగు నీళ్లు ఇవ్వడమే లక్ష్యంగా బీఆర్ఎస్ సర్కారు పనిచేసిందని, కాస్ట్ రేషియో కన్నా మానవీయ కోణమే ముఖ్యమని నిర్ణయించుకున్నామని చెప్పారు. అందుకే పాతాళంలో ఉన్న గంగమ్మను పైకెత్తి తీసుకొచ్చి ప్రజల దాహార్తిని, రైతుల కన్నీటిని తుడిచే ప్రయత్నం చేశామని వివరించారు. కాస్ట్ రేషియోను పరిగణనలోకి తీసుకుంటే తెలంగాణలో ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా కట్టలేమని, ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేమని స్పష్టంచేశారు. అరబ్బు దేశాల్లో సముద్రపు నీటిని వడపోసి తాగునీటిగా మారుస్తారని, నీళ్లు లేకపోతే మానవ మనుగడ ఉండదని, కాస్ట్ రేషియో చూసుకుంటే అక్కడ నీళ్లే తాగొద్దని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ప్రజల కోణంలో పనిచేయాలని, ప్రజల ఆరోగ్యం, విద్య, ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చేందుకు రకరకాల పద్ధతులను అనుసరించాల్సి ఉంటుందని చెప్పారు. ఆ కోణంలోనే పదేండ్లపాటు పనిచేశామని, తెలంగాణ ప్రయోజనాలే బీఆర్ఎస్‌కు అంతిమం అని స్పష్టంచేశారు. తాము తీసుకున్న చర్యలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని, భూముల విలువ, తలసరి ఆదాయం, రాష్ట్ర జీఎస్‌డీపీ పెరిగిందని, మొత్తంగా దేశంలోనే తెలంగాణ అనేక ప్రమాణాల్లో నంబర్‌వన్‌గా నిలిచిందని వివరించారు.

తెలంగాణ ప్రజల శక్తి.. బీఆర్ఎస్

> తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేది ఒక్క బీఆర్ఎస్ మాత్రమేనని కేసీఆర్ స్పష్టంచేశారు. బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల పార్టీ అని, బీఆర్ఎస్ శక్తి... తెలంగాణ ప్రజల శక్తి అని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాల కోసం తెగించి కొట్లాడేది బీఆర్ఎస్ మాత్రమే నని, పార్టీని నిలబెట్టుకుందాం, రాబోయే ఎన్నికల్లో అద్భుతమైన విజయాన్ని సాధిద్దామని పిలుపునిచ్చారు.

వద్దిరాజు, పల్లాలకు అభినందనలు

సమావేశానికి హాజరైన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కేసీఆర్‌తోపాటు సమావేశానికి హాజరైన నేతలందరూ అభినందనలు తెలియజేశారు. వద్దిరాజుకు రెండోసారి రాజ్యసభ దక్కినందుకు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉంటూ ఎమ్మెల్యే అయినందుకు అభినందించారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, హరీశ్‌రావు, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తాతా మధు, సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, ముఖ్య కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు.

లంకెబిందెలు ఎందుకు ఉంటాయి?

> కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ఖజానాలో లంకెబిందెలు ఉంటాయనుకున్నాం.. లేవు అని వ్యాఖ్యానించారని, ఇది వారి అవగాహనారాహిత్యానికి నిదర్శనమని కేసీఆర్ మండిపడ్డారు. 'వాళ్లు అధికారాన్ని మనకు అప్పగించిపోయినప్పుడు లంకెబిందెలు ఇచ్చిపోయిండ్రా? మనం 2014లో అధికారం చేపట్టేనాటికి ప్రభుత్వ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. మనం ఏనాడైనా వాళ్ల లెక్క మాట్లాడినమా? ప్రభుత్వ ఖజానాలో ఏనాడూ డబ్బులు ఉండవు. వచ్చిన సొమ్మును వచ్చినట్టు ఖజానాలో దాచిపెడితే అది ప్రభుత్వం కాదు.. వడ్డీవ్యాపారి దుకాణం అవుతుంది. డబ్బు వస్తుంది.. వెళ్తుంది. నిల్వ చేయడానికి అక్కడ ఏమీ ఉండదు. ప్రజాప్రయోజనాల కోసం ఖర్చు పెడుతుంటాం. ఏమైనా కావాలంటే లెక్కలు చూసుకోవచ్చు. ఉత్త డొల్ల ముచ్చట్లు చెప్పి తప్పించుకోవద్దు. బాధ్యత తీసుకొని ముందుకెళ్లాలి' అని హితవు చెప్పారు.

బీఆర్ఎస్ తొలి జాబితా విడుదల

నలుగురి పేర్లు ప్రకటించిన కేసీఆర్

ఖమ్మం నుంచి నామా, మహబూబాబాద్ నుంచి కవిత

పెద్దపల్లిలో కొప్పుల ఈశ్వర్, కరీంనగర్‌లో బి వినోద్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల తొలి జాబితా విడుదలైంది. బీఆర్ఎస్ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో విస్తృతంగా చర్చించి, వారి అభిప్రాయాలకు అనుగుణంగా బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం నలుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ, బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావుకు మరోసారి అవకాశం కల్పించారు. మహబూబాబాద్ (ఎస్టీ రిజర్వ్) స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవితకు మరోసారి అవకాశం దక్కింది. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి, ఢిల్లీలో తెలంగాణవాణిని బలంగా వినిపించిన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి, మరో ఉద్యమకారుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పెద్దపల్లి (ఎస్సీ రిజర్వ్ స్థానం) నుంచి బరిలో దిగనున్నారు. అన్నిస్థాయిల పార్టీ శ్రేణుల అభిమానాన్ని గెలుచుకున్న ఈ నలుగురు అభ్యర్థులకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థులు వీరే..

లోక్‌సభ స్థానం	బీఆర్ఎస్ అభ్యర్థి
కరీంనగర్	బీ వినోద్‌కుమార్
పెద్దపల్లి	కొప్పుల ఈశ్వర్
ఖమ్మం	నామా నాగేశ్వర్‌రావు
మహబూబాబాద్	మాలోత్ కవిత

సుదీర్ఘ కసరత్తు.. ఏకాభిప్రాయంతో

అసెంబ్లీ ఎన్నికల అనంతరం తెలంగాణ భవన్ కేంద్రంగా రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో పార్టీ ముఖ్యనేతలు, అన్నిస్థాయిల ప్రజాప్రతినిధులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు టీ హరీశ్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కడియం శ్రీహరి, జగదీశ్‌రెడ్డి, పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పార్టీ ముసుపెన్నడూ లేనివిధంగా అన్ని స్థాయిల్లోని పార్టీ ప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరించింది. ఆ అభిప్రాయాలను పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లింది. పార్టీ అధినేత కేసీఆర్ వార్డు/డివిజన్, మండల, జిల్లా స్థాయి నేతలతో సంప్రదింపులు జరిపారు. తాగాజా పార్టీ అధినేత కేసీఆర్ ఈ నాలుగు లోక్‌సభస్థానాల ముఖ్యనేతలతో మరోసారి ఇదే తెలంగాణ భవన్ కేంద్రంగా సమాలోచనలు చేశారు. అన్ని స్థాయిల పార్టీ, ప్రజాప్రతినిధుల ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ప్రకటించారు.

ఎఫ్‌సీఐకి సీఎమ్మార్ ఇవ్వొద్దు

డీఎంలకు పౌరసరఫరాల సంస్థ ఆదేశం

యాసంగి సీఎమ్మార్ గడువు పెంచిన కేంద్రం

ఇప్పటికే ధాన్యం వేలం వేయడంతో ఈ నిర్ణయం

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): గత ఏడాది యాసంగి సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎమ్మార్)ను ఎఫ్‌సీఐకి ఇవ్వొద్దని జిల్లా మేనేజర్లు, సివిల్‌సప్లై అధికారులకు పౌరసరఫరాల సంస్థ ఆదేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాలకు సర్క్యులర్ జారీ చేసింది. గత యాసంగి సీఎమ్మార్ గడువును కేంద్రం మరోసారి పెంచడంతో అప్రమత్తమైన పౌరసరఫరాల సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నది. ఫిబ్రవరి 29తో ముగిసిన గడువును మే 15 వరకు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే గత యాసంగి సీజన్‌కు సంబంధించిన 35 లక్షల టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ వేలం ద్వారా విక్రయించింది. ఈ నేపథ్యంలో ఈ యాసంగ